


సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 517.50 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 818.70 అడుగుల వద్ద ఉంది.



వరుస ఉత్సవాలు.. పక్కా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో ఈనెల 14 నుంచి 18వరకు వరుస పండుగలు, ఆలయ మహోత్సవాల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

గ్రంథాలయాన్ని సందర్శించిన బ్రిటిష్ లైబ్రరీ కౌన్సిల్ డైరెక్టర్



అమరావతి: స్థానిక గ్రంథాలయాన్ని మంగళవారం ఢిల్లీ బ్రిటిష్ లైబ్రరీస్ కౌన్సిల్ డైరెక్టర్ విజయలక్ష్మి, చెన్నై బ్రిటిష్ లైబ్రరీస్ కౌన్సిల్ హెడ్ మేఘాకక్కర్‌లు సందర్శించారు. తొలుత వీరు అమమరేశ్వరాలయాన్ని సందర్శించారు. అమరేశ్వరుని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి, పుస్తకాలు, పాఠకులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వారివెంట రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, జిల్లా గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శులు ఝాన్సీ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు యార్డులో మిర్చి దిగుమతులు నిలుపుదల

మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ కె. శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో బుధవారం మిర్చి బస్తాల దిగుమతులను నిలిపి వేస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్, యార్డు పర్సన్ ఇన్‌చార్జి కాకుమాను శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చి సీజన్ కావడంతో గుంటూరు మార్కెట్ యార్డుకు ప్రతిరోజు భారీ స్థాయిలో మిర్చి బస్తాలు వస్తున్నాయని, దీంతో యార్డులో రద్దీ దృష్ట్యా బుధవారం యార్డులో మిర్చి దిగుమతులను నిలిపివేయడం జరిగిందన్నారు. రైతులు మంగళవారం యార్డుకు సుమారు రెండు లక్షల మిర్చి బస్తాలను తీసుకురావడం జరిగిందన్నారు. దీంతోపాటు ఎగుమతి వ్యాపారులు కొనుగోలు చేసిన మిర్చిలో సుమారు లక్షన్నర బస్తాలు యార్డులోనే ఉన్నాయని వెల్లడించారు. మొత్తం సుమారు మూడున్నర లక్షల మిర్చి బస్తాలు యార్డులో ఉన్నాయని, దీంతో యార్డు పూర్తి స్థాయిలో నిండి ఉన్నందున బుధవారం యార్డులో దిగుమతులను నిలిపివేయడం జరిగిందని, మిర్చి రైతులు సహకరించాలని కోరారు. గురువారం నుంచి యార్డులో యథావిధిగా దిగుమతులు ఉంటాయని ఆయన తెలియజేశారు.

విజయకీలాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం 7వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు మంగళవారం వేంకటేశ్వరసామి వారికి ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం వేంకటేశ్వరస్వామి వారికి ఉత్సవారంభ స్నపనం, అభిషేకం, మంగళ శాసనములు వైభవంగా నిర్వహించామని, సాయంత్రం 5.30 నుంచి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ భగవదనుజ్ఞ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనము, రక్షాబంధనం, మృత్సంగ్రహనం, అంకురార్పణ, వైనతేయ పటాధివాసం, మంగళాశాసనములు ఘనంగా జరిగాయన్నారు. విజయకీలాద్రి దివ్యక్షేత్ర పండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు పాల్గొన్నారు.

యార్డుకు 1,49,013 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,49,013 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,37,129 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,01,807 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మహిళల జీవితాలకు ఆసరా

- వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి
- చెరుకూరులో 1173 గ్రూపులకు రూ.10.50 కోట్ల చెక్కుల పంపిణీ



మహిళా గ్రూపులకు చెక్కు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): తాను ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని చెరుకూరు గ్రామంలో నిర్వహించిన నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమంచి కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల ద్వారా బ్యాంకులలో రుణాలు తీసుకొని, వాటికి ప్రతి నెలా వడ్డీల రూపంలో పెరిగిపోతున్న అప్పులను కట్టుకోలేక గతంలో మహిళలు ఇబ్బందులు పడేవారన్నారు. అంతేకాకుండా గత టీడీపీ ప్రభుత్వంలో, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశాడని విమర్శించారు. దాంతో మహిళలు ఆర్థికంగా కుదేలవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక బ్యాంకు ఖాతాల్లో రుణం లేకుండా మాఫీ చేసి, డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈవిషయాన్ని మహిళలు గుర్తుపెట్టుకొని భవిష్యత్‌లోనూ సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు.

సచివాలయాలతో పరిపాలన వికేంద్రీకరణ..

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలను ఏర్పాటు చేయడమేకాక రాష్ట్రవ్యాప్తంగా 1.40 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను సీఎం జగన్ కల్పించారన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేసి చూపించారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆసరా ద్వారా మొత్తం నాలుగు విడతల్లో రూ.203 కోట్ల రుణమాఫీ జరగ్గా, ఒక్క నాలుగో విడతలోనే పర్చూరు మండలంలో 1173 మహిళా గ్రూపులకు సంబంధించి రూ.10.50 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. ఈఓఆర్డీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఏపీఎం వి.లాజర్, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, ఈఓ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, గాదె సురేష్, ముప్పాళ్ల రాఘవయ్య, జంగా అనిల్, కోట శ్రీనివాసరావు, జూపూడి రోశయ్య, మల్లా శ్రీనివాసరావు, నూతలపాటి బలరాం, లంకాశివ, కె.రవీంద్రబాబు, దాసి రవీంద్ర పాల్గొన్నారు.

మా జీవితాలు బాగుపడాలంటే మళ్లీ జగనే రావాలయ్యా..

ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చెరుకూరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ బిళ్ల సోవమ్మ సభలో ఉద్వేగభరితంగా మాట్లాడారు. తాను మూడు విడతల్లో చేయూత నగదు అందుకొని వాటితో కూరగాయలు పండించి జీవనం సాగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం తాను అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి దగ్గరే ఉంటున్నట్లు తెలిపారు. తమ పిల్లలు బూట్లు తొడుక్కొని, బెల్టు పెట్టుకొని, స్కూల్ బ్యాగులతో ఇంగ్లిషు మీడియం చదివేందుకు వెళ్తున్నారని ఉప్పొంగిపోయేదానినని తెలిపారు. తమ బతుకులు బాగు పడాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబాన్ని ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

కోలలపూడిలో జపాన్ బృందం

ప్రకృతి వ్యవసాయ విధానం పరిశీలన



జపాన్ బృందానికి అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి వాణిశ్రీ

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో గత కొంతకాలంగా రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పొలాలను మంగళవారం జపాన్ నుంచి వచ్చిన నలుగురు సభ్యుల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ శాఖ రాష్ట్ర, జిల్లా అధికారులు విజయకుమార్, వాణిశ్రీలు ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, వాటి ప్రయోజనాల గురించి జపాన్ బృందానికి వివరించారు. స్థానిక రైతులు బలగాని వెంకటస్వామి, మహిళా రైతు కోటేశ్వరమ్మలు, తమ భూముల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటల ఉత్పత్తుల గురించి బృంద సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన జీవ, ఘనామృతాలు, పలు రకాల కషాయాలు తయారు చేసేవిధానం క్రిమిసంహారక ఎరువులకు ప్రత్యామ్నాయంగా చీడ పీడలను సంరక్షించే విధానం గురించి వివరించారు. పంటల దిగుబడి రవాణా సౌకర్యాలు తదితర అంశాల గురించి జపాన్ బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జపాన్ బృందం నాయకుడు స్టీఫెన్ కూచో, సభ్యులు మాథ్యూస్, జకోనదోల్, స్మిలా జాకబ్, కోలలపూడి సర్పంచ్ సతీష్ కుమార్, ప్రకృతి వ్యవసాయం మండల అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేద్దాం



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో నిర్వహించనున్న మహాశివరాత్రి తిరునాళ్లను విజయవంతం చేద్దామని, ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రదేశంలో భక్తుల సౌకర్యార్థం గుర్తింపు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శీఘ్ర దర్శనం జరిగేలా ప్రొటోకాల్ పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేయాలని దానిని కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానం చేయాలన్నారు. జేసీ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు విధులను సమర్థంగా నిర్వర్తించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. స్థానిక శాసన సభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. అలాగే క్యూలైన్లలోని భక్తులకు మంచి నీరు, మజ్జిగ అందించాలని అన్నారు. అవసరమైనచోట మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మెట్ల మార్గంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, జిల్లా అటవీ శాఖాధికారి డి.రామచంద్రరావు, కోటప్పకొండ ఆలయ చైర్మన్ కొండలరావు, ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్ కేవీ ప్రసాద్

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, లే అవుట్‌లలో మంజూరు చేసిన పక్కా గృహాలను సత్వరమే పూర్తి చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ బాపట్ల జిల్లా పీడీ జేవీఎస్ఆర్ కేవీ ప్రసాద్ లబ్ధిదారులను కోరారు. మంగళవారం ఆయన బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో జగనన్న కాలనీ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. తరువాత స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణశాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమావేశం అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 25 మండలాలకు 31,846 ఇళ్లు మంజూరు చేశామన్నారు. అందులో 14,200 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకుని ఆనందంగా ఉంటున్నారని చెప్పారు. ప్రతి కాలనీలో అందరూ గృహాలు నిర్మించుకుంటే మౌలిక వసతులు సమకూరుస్తామని చెప్పారు. గతంలో పనిచేసిన ఏ ప్రభుత్వాలు చేయని విధంగా నివేశన స్థలాలను లబ్ధిదారుల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 60 శాతం మేర గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. ఆయన వెంట ఏఈ దుర్గా రమేశ్, ఎంపీడీఓ హనుమారెడ్డి ఉన్నారు.

మహా సంగ్రామానికి సన్నద్ధం కండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయండి
- పెత్తందారులు.. పేదలకు మధ్య జరుగుతున్న పోరాటం ఇదీ
- రానున్న ఎన్నికలు ఎంతో కీలకం
- ప్రజల ఆశీస్సులు సీఎం జగన్‌కు మెండుగా ఉన్నాయి
- అర్జునుడిలా ప్రతిపక్షాలపై సీఎం జగన్ ఎంతటి పోరాటానికైనా వెనుకాడరు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకుల సమావేశంలో ఎంపీ విజయసాయిరెడ్డి
- గుంటూరు పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

పట్నంబజారు: మహా సంగ్రామం మొదలు కాబోతోంది.. ప్రతిఒక్కరూ పోరుకు సన్నద్ధం కావాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, ప్రత్తిపాడు, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకులతో సమీక్షా సమావేశం జరిగింది. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి ప్రతి అంశాన్ని కూలంకుషంగా చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రచార అంశాలు, విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాయని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు తెలియజేస్తూ ఓటు అడగాలని నేతలకు సూచించారు. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమన్న విషయాన్ని గమనించి నేతలు ముందుకు సాగాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దేవుని, ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. పెత్తందారులు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రతిపక్షాల కుయుక్తులను అర్జునుడిలా ఛేదించగల సత్తా సీఎం జగన్‌కు ఉందన్నారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు వివరించేలా పార్టీ సైన్యాన్ని సిద్ధం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతి కుటుంబానికి అందిన మేలు తెలుసుకుని ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించే దిశగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు దృష్టి సారించాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 99 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, గత రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల పక్షాన నిలబడిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలు, నా మైనార్టీలంటూ అన్ని వర్గాలను సొంతం చేసుకున్న సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, మేకతోటి సుచరిత, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, సమన్వయకర్తలు షేక్ నూరిఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నేత విడదల గోపి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పలు నియోజకవర్గాల పరిశీలకులు అడపా శేషు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ నేతలు కత్తెర సురేష్‌తోపాటు పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్, మండల అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యారు.

ప్రజల గుండెల్లో చెరగని స్థానం

- సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- మేదరమెట్లలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



మేదరమెట్లలో ఆసరా చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం మంగళవారం జరిగింది. చెక్కుల పంపిణీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హనిమిరెడ్డి మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ప్రేమగా జగనన్న అని పిలుచుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలకు కూడా సంక్షేమ పథకాలను అందించిన ఘనత దేశంలో ఒక్క సీఎం జగనన్నకే సాధ్యమైందన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చేయకుండా ఎగ్గొట్టిన చంద్రబాబు మాటలు నమ్మవద్దన్నారు. అక్కచెల్లెమ్మలను మోసం చేసిన ఘనత ప్రతిపక్షనాయకుడిది అయితే ఇచ్చిన మాట తప్పకుండా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం...



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబాలు కూడా బాగుపడుతాయన్న సంకల్పంతో ప్రతి పథకం వాళ్ల పేరుమీదే ఇవ్వడం చరిత్రలో ఎక్కడా లేదని చినహనిమిరెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రిగా జగనన్నను, అద్దంకిలో తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మొత్తం 1071 సంఘాలలోని 10557 మంది సభ్యులకు రూ.8.48 కోట్ల చెక్కును స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, జెడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జంపు హరిబాబు, ఏఎంసీ చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, ఎంపీడీఓ సమతవాణి, ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్, ఏపీఎం అనురాధ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ నాయకులు, సహకార సంఘాల సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ హోర్డింగ్ చించివేత

చినగంజాం: మండల కేంద్రంలోని సోపిరాల రైల్వేగేట్ సెంటర్‌లో ఉన్న ఓ కాంప్లెక్స్ మొదటి అంస్తుపై వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ తరపున సోమవారం భారీ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీలోని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోను చించివేశారు. ఈ విషయమై వెంటనే స్పందించిన సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు వారి అనుచరులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. హోర్డింగ్ చించివేసిన ప్రాంతాన్ని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా దుశ్చర్యకు పాల్పడిన అగంతకులను గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

రైలులో నగదు, బంగారు అభరణాల పట్టివేత

నరసరావుపేటటౌన్: రైలులో అక్రమంగా తరలిస్తున్న నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కాచిగూడ–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం తనఖీలు నిర్వహించగా గుంటూరుకు చెందిన దొండపాటి మోహన్‌రావు, విజయవాడకు చెందిన బి అనంద్‌కుమార్‌లు అనుమానస్పదంగా కనపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనఖీలు చేశామన్నారు. వారి వద్ద సుమారు రూ.11 లక్షల నగదు, 391 గ్రాముల బంగారు అభరణాలు లభ్యమయ్యాయన్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.29లక్షలు ఉంటుందని చెప్పారు. నగదు, బంగారు ఆభరణాలకు ఎటువంటి రసీదులు లేకపోవడంతో చట్ట ప్రకారం వీటిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని విద్యార్థిని దుర్మరణం

తెనాలి రూరల్: టిప్పర్ ఢీకొని విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసుల కథనం.. రామలింగేశ్వరపేట రైస్ కాలనీకి చెందిన చెరుకూరి దివ్యశ్రీ(20) బీసీఏ మూడో సంవత్సరం చదువుతోంది. స్నేహితురాళ్లతో కలసి స్కూటీపై మంగళవారం సాయంత్రం దుగ్గిరాల వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నందివెలుగు– కంచర్ల పాలెం మధ్యలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. స్నేహితులు, కటుంబ సభ్యులు తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్రద్ధ చేస్తే అతిప్రమాదం

- ఓఆర్ఎస్ ప్యాకెట్లతో కట్టడి చేయవచ్చు
- అన్ని కాలాల్లో అతిసార ప్రబలే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్యులు



గుంటూరు మెడికల్: ప్రతి ఏడాది జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతున్నాయి. ఎక్కువగా వర్షాలు కురిసినప్పుడు, వేసవిలో అతిసార వ్యాధి కేసులు ఎక్కువగా వస్తుంటాయి. సీజన్ మారినప్పుడల్లా అతిసార వ్యాధి కేసులు రావడం సహజంగా జరుగుతోంది. కొద్దిరోజులుగా గుంటూరు నగరంలోని పలు ప్రాంతాలతోపాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతున్నాయి. అతిసారను అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. అతిసారపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిని కట్టడి చేయవచ్చు.

వ్యాధికి కారణాలు..

విరోచనాలు నీళ్ల నీళ్లగా, పలచగా అవుతుంటే అతిసారవ్యాధి అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటిరైటిస్‌గా పిలుస్తారు. నీళ్ల విరోచనాలు నూటికి 70శాతం వైరస్‌ల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగటం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలాక ఆ ఆహారం తినటం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు..

జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్థంగా ఉండి వాంతులు, విరేచనాలు అవుతాయి. విరేచనాలు నీళ్లగా పలుచగా కావటం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్ళి డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం జరుగుతోంది. ఒక్కోసారి అసలు నాడి తెలియకపోవచ్చు. నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకుపోవడం జరుగుతోంది. శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం, లేదా తక్కువ రావడం, లేదా ముదురు పసుపురంగులో రావడం జరుగుతోంది. వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తోంది. దీనివల్ల పిల్లలు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి...



అతిసార వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పొడర్‌ను లీటర్ నీటిలో కలుపుకొని తాగాలి. విరేచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. ద్రవరూపంలో ఉండే ఆహారం అందజేయాలి.

– డాక్టర్ బి.రమేష్,
పిల్లల వైద్య నిపుణులు, గుంటూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



అతిసార బాధితులకు ద్రవ రూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లి, గంజి, పలచగా తయారుచేసిన సగ్గుబియ్యం, రాగిజావ, కొబ్బరి నీరు, నిమ్మరసం ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. మలమూత్ర విసర్జన అనంతరం, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగటం చాలా ఉత్తమం. రోడ్లపైన, తోపుడు బండ్లపై మూతలు లేకుండా అమ్మే ఆహార పదార్థాలు తినకుండా ఉండాలి. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవటం చేయవద్దు. అతిసార వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్యుని పుణుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ప్రత్యేక వైద్య శిబిరాలు..



అతిసార ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలూ వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ప్రత్యేక వైద్య శిబిరాల వద్ద బాధితులకు ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే తక్షణమే జీజీహెచ్‌కు తరలించేందుకు ఒక్కో వైద్యశిబిరం వద్ద రెండు 108 అంబులెన్సు వాహనాలు అందుబాటులో ఉంచాం. ఆరోగ్య కేంద్రాలు సైతం రాత్రిళ్లు పనిచేసేలా ఏర్పాట్లు చేశాం. నగరంలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాం. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ప్రజలకు వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు 35 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశాం. ఒక్కో వైద్య బృందంలో ఐదుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. వీరు ప్రజలకు అవగాహన కల్పించి జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ

సాంకేతిక నైపుణ్యాలతో విద్యాబోధన

పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాల వినియోగించుకుని బోధన చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం వద్ద ఉన్న పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించారు. జోన్–3 పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. మండల విద్యాశాఖాధికారులు సమష్టి కృషితో విద్యాభివృద్ధిలో జోన్–3 ప్రథమస్థానంలో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, గోరుముద్ద వంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో హెచ్ఎంల పాత్ర కీలకమని అన్నారు. ఎంఈఓలు నిరంతరం పాఠశాలలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

యూపీహెచ్‌సీల్లో వైద్యసేవలు భేష్

సంతృప్తి వ్యక్తం చేసిన సెంట్రల్ ఎన్‌క్యూఎస్ టీమ్ సభ్యులు



సెంట్రల్ టీంతో నల్లపాడు యూపీహెచ్‌సీ సిబ్బంది

గుంటూరు రూరల్: యూపీహెచ్‌సీలలో ప్రజలకు వైద్య సేవలు అద్భుతంగా అందుతున్నాయని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఎస్) టీం సభ్యులు డాక్టర్ శ్రీకుమార్, షకీలాలు తెలిపారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎన్‌క్యూఏఎస్ టీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ల్యాబ్‌లు, ప్రజలకు అందించే మందులు, వైద్యం అందించే విధానంతో పాటు రోగులతో వైద్యులు మెలిగే విధానాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు ప్రజలకు అందించే వైద్య సేవలను ప్రజలకు వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు.హెల్త్ సెంటర్ నిర్వహణ, రోగులకు వైద్యం అందించే విధానాలపై యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణప్రభ సంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఇంటివద్దకే అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 12 రకాల చెక్‌లిస్ట్‌లను తనిఖీ చేసి క్వాలిటీ స్టాండర్డ్స్ అసెస్మెంట్ చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఇంటివద్దకే అందిస్తుందన్నారు. నల్లపాడు ప్రాంతంలోని ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ టీంతో పాటు వైద్యులు, ఆశావర్కర్‌లు, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులున్నారు.

తాడికొండ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

తాడికొండ: గుంటూరు జిల్లా తాడికొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)లో 2023–24 ఏడాదికి ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వనిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు తెలిపారు. మొత్తం 80 సీట్లు ఉండగా ఎస్సీ–60, బీసీ(సీ)–10, ఎస్టీ–5, బీసీ–4, ఓసీ–1, రిజర్వేషన్ ప్రకారం కేటాయింపులు ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, విద్యాబోధన పూర్తిగా ఇంగ్లిష్‌లోనే ఉంటుందని చెప్పారు. గుంటూరు, బాపట్ల, మరియు పల్నాడు జిల్లాల్లో ఏ ప్రాంతంలో నివసించే వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని, కావున అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఏపీ బీఆర్ఏజీ సెట్ డాట్ ఏపీ ఈఎఫ్ఎఫ్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేరుగా కూడా తాడికొండలోని తమ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ ఫోన్ నంబరు 9948138872ను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు



పాత గుంటూరు: గుంటూరు ఆర్టీసీ 2 డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు ప్రదానోత్సవ సభ నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా డీటీసీ షేక్ కరీం పాల్గొని జిల్లాలోని ఐదు డిపోలలో ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను టీడీపీ శ్రేణులూ ఒప్పుకోవాల్సిందే..



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- టీడీపీ నుంచి 30 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరిక

అద్దంకి: తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారితో పార్టీ జెండా రెపరెపలాడుతోందని నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 20 వార్డులో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సదరు వార్డుకు చెందిన 30 మంది యువకులు వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, పిల్లిమెట్ల రమేష్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ చిన హనిమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ విధానాలు నచ్చక, ఆ పార్టీని నాయకులు, కార్యకర్తలు వీడుతున్నారన్నారు. సంక్షేమ పాలనను టీడీపీ శ్రేణులు సైతం ఒప్పుకోవాల్సిందేనన్నారు. గతంలో ఇలాంటి పరిపాలనను ఏ ప్రభుత్వమైనా అందించిందా అని హనిమిరెడ్డి ప్రశ్నించారు. ఇదే ఉత్సాహంతో మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాలసేకరణ ఏజెంట్ మృతి

సూరేపల్లిలో విషాద చాయలు



సాంబిరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బల్లికురవ: మొక్కజొన్న పొలంలో పందుల నివారణకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి పాల సేకరణ ఏజెంట్ మృతి చెందిన ఘటన బల్లికురవ మండలంలోని సూరేపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. సూరేపల్లి గ్రామానికి చెందిన చంటి సాంబిరెడ్డి (42)కి రెండెకరాల పొలం ఉంది. పాల సేకరణతో కుటుంబాన్ని పోషించుకున్నాడు. ప్రతి రోజు పాలసేకరణ అనంతరం కొమ్మాలపాడు డెయిరీ వద్దకు వెళ్లి పాల శాతం చూసుకొని ఇంటికి తిరిగి వస్తుంటాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి సుమారు 10.30 గంటల తర్వాత బైకుపై అద్దంకి బ్రాంచ్ కాలువ కట్టపై వస్తుండగా.. పక్కన మొక్కజొన్న పొలాల్లో అడవి పందుల నివారణకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు తగిలి చనిపోయాడు. ఈ మేరకు బంధువులు, మృతుడి భార్య సంధ్య ఇచ్చి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పొలం యజమానులు తమపై ఎక్కడ కేసు పెడతారోనని.. సాంబిరెడ్డి మృతదేహాన్ని అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద 20 అడుగుల లోతులో ఉన్న ఈటీలో పడేశారని, బైకు ఒక చోట, చెప్పులు ఒక చోట, మృతదేహం మరోచోట పడి ఉందని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సంతమాగులూరు సీఐ నరసింహారావు, బల్లికురవ ఎస్సై నాగశివారెడ్డి పరిశీలించారు. మృత దేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడేళ్ల క్రితం మృతుడి కుమారుడు గణేష్‌రెడ్డి గ్రామ సమీపంలోని మర్రికుంటలో తోటి పిల్లలతో ఆడుకుంటూ కుంటలో దిగి చనిపోయాడు. కుమార్తె జాహ్నవి నరసరావుపేటలో పదో తరగతి చదువుతోంది.

అమ్మ కర్కశత్వం

మానవత్వం మంటకలిసింది. పాదులు చేసి.. నీరు పోసి.. నెమ్మదిగా పురికొన పందిరి మీదికి.. పాకిస్తున్న ఈ ప్రేమ పంచే చేతులు.. అమృతం పంచే అమ్మ.. కన్నపేగు పంచుకుని పుట్టిన చిట్టితల్లిని చిదిమేస్తే.. ప్రాణాన్ని పణంగా పెట్టి బిడ్డకు జన్మనిచ్చిన తల్లే ప్రియుడు మోజులో పడి కర్కశత్వంతో చిన్నారిని చిదిమేసి.. అమ్మతనానికి కళంకం తెచ్చింది. ఈ ఘటన బందారుపల్లిలో చోటుచేసుకుంది.

- మానవత్వం 'మంట'కలిసింది
- పేగుబంధాన్ని చిదిమేసింది
- బండారు పల్లిలో దారుణ ఘటన చోటుచేసుకుంది



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సీహెచ్ ప్రభాకర్

తాడికొండ: వివాహేతర సంబంధంతో ప్రియుడు మోజులో కన్న బిడ్డనే కాల్చి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ఆలూరు మండలానికి చెందిన కొణతాల సిద్దార్థ్ హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో లాలాగూడకు చెందిన జనగాల స్వప్న ఇన్‌స్టా గ్రామ్‌లో పరిచయమైంది. ఇద్దరి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. స్వప్నకు అప్పటికే ఆరేళ్ల పాప నేహ ఉంది. పాపతో సహా వారు 25 రోజుల క్రితం పారిపోయి వచ్చి బందారుపల్లి పొలాల్లో గుడారం వేసుకొని మిర్చి పనులకు వెళుతున్నారు. వివాహేతర సంబంధానికి పాప అడ్డుగా ఉందని భావించి పాపను 8వ తేదీన కొట్టి చంపి, అనంతరం బండారుపల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి పక్కన ఉన్న ముళ్ల కంపలో శవాన్ని తగలబెట్టారు. స్థానికులు కొన్ని రోజులుగా పిల్ల కనిపించడం లేదని అనుమానించారు. దీంతో కాలిపోయిన మృతదేహం కనిపించడంతో వీరిపై అనుమానంతో స్థానికులు వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ పరిశీలించారు. పంచనామా నిమిత్తం పాప మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సహకార రంగం అభివృద్ధికి పటిష్ట చర్యలు

ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్, కో–ఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: కోఆపరేటివ్ సెక్టార్‌ను పటిష్ట పరిచేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్ కోఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం తాడికొండ కోఆపరేటివ్ సొసైటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత భారీ మార్పులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారన్నారు. ఏపీలో విభజన అనంతరం కేవలం 29 వేల కోట్ల లోపే రైతులకు రుణ వసతి కల్పించే ఈ సెక్టార్‌ను సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని రకాల రుణాలను 1లక్ష, 28 వేల కోట్లకు పెంచి అందజేశారని కొనియాడారు. గతంలో కోఆపరేటివ్ సొసైటీలు కేవలం వ్యవసాయ రుణాలు మాత్రమే అందజేశారని, నేడు సీఎం జగనన్న అన్ని రకాల రుణాలు అందించడంతో పాటు రూ.320 కోట్లు రుణ భారాన్ని ప్రభుత్వం భరించి రైతులకు సేవలందించిందన్నారు. గతంలో ఇతర దేశాల్లో చదువులకు విద్యా రుణాలు కేవలం కమర్షియల్ బ్యాంకుల్లో మాత్రమే అందించేవారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కేవలం ఒక్క గుంటూరు లోనే దాదాపు 720 మందికి ఇతర దేశాలు పంపించేందుకు రుణవసతి కల్పించారని తెలిపారు. చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలకు రాయితీ రుణాలు పెంచారని చెప్పారు. తాడికొండ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రూ.18 కోట్లు రుణవసతి కల్పించడం జరిగిందని, రైతుల కోసం రూ.50 లక్షల విలువైన ఎరువులు అందించడం జరిగిందన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేయడంతో పాటు జనరిక్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రతి మనిషికి తక్కువ ధరలకు మందులు అందించే ప్రక్రియను ఏర్పాటు చేయటాన్ని యావత్ రాష్ట్రం అభినందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తాడికొండ సొసైటీ ఛైర్మన్ షేక్ నగీనా, రావెల, ఫిరంగిపురం సొసైటీ ఛైర్మన్‌లు శ్రీనివాసరెడ్డి, పి అంజిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి బెజ్జం ప్రసాద్, సిఈవో సుజనీఎన్‌సీడీసీ అధికారి ఎస్ జగదీశ్వరరావు, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, నల్లిబోయిన శ్రీనివాసరావు పలువురు వైఎస్సార్‌సీపీనాయకులు పాల్గొన్నారు.